ఆవుల వెంకటేశ్వర్లుకు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైవీయూ పీజీ కళాశాల అప్లయిడ్ మ్యాథమెటిక్స్ స్కాలర్ ఆవుల వెంకటేశ్వర్లుకు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. అప్లయిడ్ మ్యాథమెటిక్స్ విభాగసహ ఆచార్యులు డాక్టర్ ఎస్.సునీత పర్యవేక్షణలో 'థిరిటికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ద క్యారెక్టర్ స్టిక్స్ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఆన్ వేరియస్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ ఓవర్ ఏ స్ట్రెచ్ బై యూజింగ్ టెక్నికల్ టూల్స్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఆవుల వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ సర్టిఫికెట్‌ను వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావు జారీ చేశారు. పరిశోధకుడు రాసిన పరిశోధనా పత్రాలు పలు జర్నల్లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆవుల వెంకటేశ్వర్లు ను, గైడ్ డాక్టర్ ఎస్.సునీత ను విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అప్లైడ్ మ్యాథమెటిక్స్ విభాగ అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు అభినందించారు.

ప్రయివేట్ ట్రావెల్స్ దోపిడీ!

కడప-హైదరాబాద్, బెంగళూరు ఛార్జీలు రెట్టింపు
సంక్రాంతి పేరిట ప్రయి'వేటు' వడ్డన
మొక్కుబడిగా రవాణా శాఖ తనిఖీలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ప్రయివేటు ట్రావెల్స్ సంక్రాంతి పేరిట రెట్టింపు ఛార్జీలతో ప్రయాణికులను దోచుకుంటున్నాయి. సాధారణంగా ప్రయివేటు ట్రావెల్స్ సాధారణ రోజుల్లో సదుపాయాల కల్పన పేరుతో ఆర్టీసీ కంటే అధిక ఛార్జీలను వసూలు చేస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా 15 శాతం అధికంగా వసూలు చేయడం సహజం. ఛార్జీలను పెంచడంపై పెద్దఎత్తున విమర్శలు వర్షం కురవడం తెలిసిందే. ఈ ఏడాది విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ వంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి రెట్టింపు ఛార్జీలను వసూలు చేస్తుండటాన్ని ప్రభుత్వం చోద్యంగా చూస్తుండడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది.

జిల్లా నుంచి హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, విజయవాడ ప్రాంతాలకు 100 ప్రయివేటు ట్రావెల్స్ రాకపోకలు సాగిస్తున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించి ఆర్టీసీ సుమారు 200 బస్సు సర్వీసులను నిర్వహిస్తోంది. పొరుగు జిల్లాల నుంచి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు సుమారు వెయ్యి బస్సు సర్వీసులు నిర్వహిస్తోంది. రెండ్రోజుల కిందట జిల్లా (ట్రాన్స్ పోర్ట్) రవాణాశాఖ అధికారులు ప్రయివేట్ ట్రావెల్స్ అధికారులతో సమావేశాలు నిర్వహించి, అధికఛార్జీలు వసూలు చేయరాదని హెచ్చరించారు. అయినప్పటికీ ప్రయివేట్ ట్రావెల్స్ యజమానులు సమావేశంలోని నిర్ణయాల అమలును పట్టించుకోవడం లేదు సరికదా, సాధారణ ఛార్జీలకు రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

రెట్టింపు దోపిడీ

హైదరాబాద్ నుంచి కడపకు సాధారణ రోజుల్లో ఛార్జీ రూ.800 ఉండగా రూ.1500, స్లీపర్ ఛార్జీ రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు వరకు వసూలు చేస్తున్నారు. బెంగళూరు నుంచి సాధారణ రోజుల్లో రూ.650 ఉండగా ప్రస్తుతం రూ.వెయ్యి, స్లీపర్లో సాధారణ రోజుల్లో రూ.850 ఉండగా రూ.1,500 వసూలు చేస్తున్నారు. విజయవాడ నుంచి కడపకు సాధారణ రోజుల్లో రూ.650 ఉండగా, ప్రస్తుతం రూ.వెయ్యి, స్లీపర్ సాధారణ రోజుల్లో రూ.వెయ్యి ఉండగా రూ.1,500 వసూలు చేస్తున్నారు. కడప-చెన్నయ్ టికెట్టు సైతం సాధారణం రూ.600, స్లీపర్ టికెట్ రూ.1,500 చొప్పున వసూలు చేస్తున్నారు.

మొక్కుబడి తనిఖీలు

జిల్లాలోని ప్రయివేటు ట్రావెల్స్ యజమానులు రవాణా శాఖ అధికారులు నిర్వహించిన సమావేశ నిర్ణయాలను అమలు చేయడం లేదు. జిల్లా (ట్రాన్స్‌పోర్ట్) రవాణా శాఖ అధికార యంత్రాంగం కడప, ప్రొద్దుటూరులో ప్రయివేట్ ట్రావెల్స్‌పై సర్వీసు రెన్యువల్స్, రూట్ సర్వీసులకు అనుమతి వంటి అంశాలపై తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. 10 అక్రమ సర్వీసులకు రూ.5,73,600 లక్షల మేరకు స్వల్పమొత్తంలో జరిమానాలు విధించడం కొసమెరుపు. ప్రభుత్వ నిబంధనల్ని అతిక్రమించి ఛార్జీలు వసూలు అంశం ఆధారంగా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకుని ఉంటే సామాన్య ప్రయాణికులకు ఎంతో ఊరట లభించి ఉండేదని చెప్పవచ్చు. దీనిపై ట్రాన్స్‌పోర్ట్ అధికారిని సంప్రదించగా 11 నుంచి 18వ తేదీ వరకు తనిఖీలు నిర్వహిస్తామని ఉంటామని, అధికారికమైన గుర్తింపు లేని వాహనాలపై జరిమానాలు విధిస్తామని పేర్కొనడం గమనార్హం.

కడప బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప బాలోత్సవం 2వ పిల్లల పండుగ ఫిబ్రవరి 1,2న సెయింట్ జోసెఫ్ బాలుర పాఠశాలలో ఉంటుందని కడప బాలోత్సవం అధ్యక్షులు గోపాల్ తెలిపారు. శనివారం ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితానికి చదువు చాలా ముఖ్యమే, కానీ పిల్లలు ఒత్తిడితో కాక ఇష్టపడి చదివే వాతావరణం కావాలని పేర్కొన్నారు. వారి అభిరుచులు, ఆసక్తులు, సృజనను, జ్ఞాన తృష్ణను ప్రోత్సహించే పరిస్థితులు ఉండాలన్నారు. గౌరవాధ్యక్షులు నాగమునిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత రాకెట్ యుగంలో మానవ సంబంధాలు, కుటుంబ బంధాలు, స్నేహ భావాలు బలహీనపడుతున్నాయని చెప్పారు. సహకారతత్వం సడలుతోందని, పెద్దవారికి, సాటి వారికి సేవ చేయాలనే భావన కొరవడుతోందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పనుల వత్తిడితో పిల్లలకు మొబైల్ ఇవ్వడం ద్వారా చదువులతో వెనుకబడటం, ఆటపాటలు లేక ఊబకాయం రావడం, మత్తు పదార్థాలకు అలవాటు పడటంలాంటివి సర్వసాధారణమైపోయాయి. ప్రధాన కార్యదర్శి రాహుల్ మాట్లాడుతూ చదువులతో కష్టపడే పిల్లలకు బాలోత్సవం ఓ పండుగ, ఒక ఆటవిడుపు, ఒక వేడుక, ఒక మహోత్సవం అన్నారు. పాఠశాలల కలయిక, జీవితాంతం గుర్తుండే సంఘటన, ఇంటి బయట వెళ్లి విరిసే ఆహ్లాదం మన చిన్నారులతోనే కావున కడప బాలోత్సవం 'రెండవ పిల్లల పండుగ' ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి, నాయకులు బాల ఎల్లారెడ్డి, సత్యనారాయణ, కార్యదర్శులు లక్ష్మీరాజా, వెంకటసుబ్బయ్య, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, యల్లేశ్వరావు, శివరాం, అరుణ, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సుందరయ్య, మధుసూదన్, నరసింహారావు హాజరయ్యారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

అభిషేక్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు

- భౌతికకాయానికి నివాళులర్పించిన జగన్

నివాళులర్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సమీప బంధువు వైసిపి నాయకులు డాక్టర్ వైఎస్.అభిషేక్‌రెడ్డి శుక్రవారం హైదరాబాదులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని అదేరోజు రాత్రి పులివెందులలోని ఆయన నివాసానికి తీసుకువచ్చారు. జగన్మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి శనివారం బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో పులివెందులకు చేరుకుని అభిషేక్‌రెడ్డి నివాసంలో భౌతికకాయానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జగన్ భావోద్వేగానికి లోనయ్యారు. రోడ్డుపై నడుచుకుంటూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అభిషేక్‌రెడ్డి అంతిమయాత్రకు జిల్లాలోని వైసిపి శ్రేణులు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. క్రైస్తవ మతాచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. తర్వాత హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్లిపోయారు. అభిషేక్‌రెడ్డికి కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, శాసనమండలి మాజీ చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వైఎస్.ప్రమీలమ్మ, వైఎస్.ప్రతాప్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి నివాళులర్పించారు.

సుశీలమ్మను పరామర్శించిన జగన్ : కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న తన సమీప బంధువు వైఎస్.ఆనందరెడ్డి సతీమణి వైఎస్. సుశీలమ్మను జగన్మోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

సమాజాభివృద్ధికి తోడ్పాటునందించాలి

- ఐఎంఎ జిల్లా అధ్యక్షులు అవ్వారు అర్జున్‌కుమార్

ప్రజాశక్తి - కడప సిటీ

పాత్రికేయులు, వైద్య నిపుణులు పరస్పర సహకారంతో సమాజాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఐఎంఎ జిల్లా అధ్యక్షులు అవ్వారు అర్జున్‌కుమార్, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ అంపాబత్తిన గౌరీ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో తెలుగు జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో వైద్యనిపుణులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత్రికేయం, వైద్యవృత్తులు ఒత్తిడితో కూడుకున్న వ్యవస్థలని, అటు వంటి ప్రాధాన్యత కలిగిన వ్యవస్థలు కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ధ్యానం ద్వారా ఒత్తిడిని అధిగ మించే ప్రయత్నం చేయాలని సూచించారు. డాక్టర్ మనోహర్, డాక్టర్ రబ్బాని మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తల ద్వారా అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పాత్రికేయులు వైద్య సంబంధిత వార్తలు రాసే సమయంలో రోగులపాటు, వైద్యనిపుణుల అభిప్రాయాలు తీసుకుని రాయాలని సూచించారు. అనంతరం సుమారు 20 మందికిపైగా వైద్య నిపుణులను శాలువా, మెమోంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో రిమ్స్ డెంటల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సురేష్, కెఎస్‌హెచ్ హాస్పిటల్ ప్రముఖ చిన్నపిల్లలు వైద్యనిపుణులు డాక్టర్ సద్దాంహుసేన్, అరుణాచల్ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ కె.కరీముల్లా, డాక్టర్ రుఖియా, ప్రముఖ ఆర్థో డాక్టర్ జహంగీర్‌బాషా, మహేష్‌బృంగి, డాక్టర్ రామాంజనేయరెడ్డి,. డాక్టర్ వంశీధర్, తదితర పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంలో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి-చెన్నూరు

లేగ దూడల పెంపకంలో మెలకువలు తప్పనిసరిగా పాటించినట్లయితే దూడలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ సి.శారదమ్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని నరసారెడ్డిపల్లెలో డిపిఎల్‌డిఎ కడప వారి ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లేగ దూడల పెంపకంలో మెలుకువలతో పాటు యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా వ్యాధి నివారణ గురించి రైతులకు వివరించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి రకం దూడలను సంతాన ఉత్పత్తిచేసుకోవచ్చని తెలిపారు. రైతులు మేలు జాతి రకంపై ఆసక్తి చూపినట్లయితే తక్కువ సమయంలోనే ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని చెప్పారు. అనంతరం లేగ దూడల ప్రదర్శనశాలను పరిశీలించారు. 4 2 లేగ దూడలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయని పేర్కొన్నారు. ప్రదర్శనకు లేగ దూడలను తీసుకొచ్చిన రైతులతో ఆమె మాట్లాడి పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు అందజేశారు. అనంతరం పశువైద్యాధికారుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యవంతంగా పెంపకం చేసిన లేగ దూడల రైతులకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి సుబ్బమ్మ, రెండవ బహుమతి వీరారెడ్డి, మూడవ బహుమతి నాగ సుబ్బారెడ్డికి అందజేశారు. ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి రైతుకు స్టీలు గిన్నె, కాల్షియం మందులు, ఏలికే పాముల మందులు ఉచితంగా అందించారు. ఆర్థిక సహాయ సహకారాలు అందించిన ఎపి ఎల్‌డిఎ వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులురెడ్డి, డిపిఎల్‌డిఎ వైద్యులు శివరామిరెడ్డి డాక్టర్ శరత్, గొర్రెల విభాగం వైద్యాధికారి నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

పాడి రైతులు ప్రభుత్వం నిర్మించే మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. చింతకొమ్మదిన్నెలో శంకర్‌రెడ్డి నిర్మించిన మినీ గోకులాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, ఉపాధి హామీ అధికారులు సమన్వయంతో నియోజకవర్గానికి మంజూరైన మినీ గోకులాలను వందశాతం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మినీ గోకులాల వల్ల పాడి పశువులు, ఎండ, వాన, వడదెబ్బకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. అధికారులు పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గానికి మంజూరైన మినీ గోకులాలను వెంటనే పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ప్రభుత్వం ఉపాధి పనులు పక్కదారి పట్టిపేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అటువంటి పొరపాట్లను జరగనివ్వమని ఆయన హామీ ఇచ్చారు, ఎమ్మెల్యే వెంట అధికారులు, మండల టిడిపి కన్వీనర్ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం మోహన్ బాబు, గోపాల్ రెడ్డి, ఆర్ఎస్ వీర కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజారావు, అధికారులు ఎపిఒ రామానుజన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్ : భోగి పండుగ సందర్భంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలతో జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్‌పి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమానికి రావొద్దని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్ల సమావేశంలో వైవీయూ విసి కృష్ణారెడ్డి

పరిశ్రమల సహకారంతో ఉన్నత విద్యాభివృద్ధి : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

పరిశ్రమల సహకారంతోనే ఉన్నత విద్య అభివృద్ధి సాధ్యమవుతుందని విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉన్నత విద్యలో ప్రయోగాత్మక అభ్యసనం, ఒకే దేశం ఒకే పరీక్ష, నిరంతర సమగ్ర మూల్యాంకన పద్ధతుల, వినూత్న పద్ధతుల అమలుపై సౌత్ జోన్ వైస్ ఛాన్సర్ల సమావేశంలో చర్చించామని చెప్పారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ తమిళనాడులోని వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని అన్నా ఆడిటోరియంలో 'అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు)' ఈనెల 10,11 తేదీలలో 'పునరాలోచన అసెస్‌మెంట్ మూల్యాంకనం'పై రెండు రోజుల సౌత్ జోన్ వైస్-ఛాన్సలర్ల సమావేశం నిర్వహించారని చెప్పారు. స్టార్టప్‌లు, పెట్టుబడిదారులు, ఇంక్యుబేటర్‌లతో సహకారాన్ని అన్వేషించడం ద్వారా ఆవిష్కరణలను పెంపొందించడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతతో ఉందన్నారు. విద్యా సంస్థలు పరిశ్రమలతో అనుసంధానమై పనిచేస్తే నైపుణ్యత గల విద్యార్థులు సమాజం లో వస్తారని ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగాలన్నారు. విద్యాలయంలో పర్యావరణ వ్యవస్థను పెంపొందించడానికి మద్దతు ఇచ్చే మార్గాలను అన్వేషించడానికి టి-హబ్ అధికారులతో సంభాషించామన్నారు. దక్షిణ భారతదేశంలోని దాదాపు 100 ఉన్నత విద్యా సంస్థల విసిలు ఒకచోట భేటీ అయ్యారని చెప్పారు.

పాడి రైతులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి-అట్లూరు

పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుం దని బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రితీష్‌రెడ్డి స్పష్టం చేశారు.

గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న రితీష్‌రెడ్డి

అట్లూరులో రైతు, అట్లూరు నీటి సంఘం అధ్యక్షులు బోవిల్ల శివరా మిరెడ్డి నిర్మించుకున్న మినీ గోకులం షెడ్డును రితీష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ నిధులతో రోడ్లు, కాలువలు, పశువుల షెడ్ల నిర్మాణ పనులను చేపట్టారన్నారు. రెండు పశువులు ఉన్నవారికి రూ 1.15 లక్షలు, 4 పశువులు ఉన్నవారికి రూ 1.85 లక్షలు, 6 పశువులు ఉన్న వారికి రూ 2.30 లక్షల విలువైన మినీ గోకులం షెడ్లను 90 శాతం రాయితీతో మూడు కేటగిరీలుగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కోళ్లు, గొర్రెలు, మేకల సంఖ్యను బట్టి పెంపకం దారులకు కూడా 70 శాతం రాయితీతో గోకులం షెడ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రమాదేవి, ఎంపడిఒ భాస్కర్ బాబు, సర్పంచ్ ఎల్లమ్మ, మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులు రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు జై కృష్ణారెడ్డి , యువనాయకుడు బోవిల్ల విష్ణు వర్ధన్ రెడ్డి, ఎపిఒ జై చంద్ర, ఇ.సి. సుధాకర్, బద్వేల్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కాకి రిషికేశవ, ఎంపిపి ఇన్‌ఛార్జి రెడ్డయ్య, డీలర్ గంగిరెడ్డి, నర్సారెడ్డి, చిలిపి కృష్ణారెడ్డి, మస్తాన్ యాదవ్, పరమేష్ యాదవ్, ఈశ్వర్ రెడ్డి, పొత్త పి. పెంచలయ్య, పొత్తపి నరసింహ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప శిల్పారామంలో ముగ్గుల పోటీలు శనివారం నిర్వ హించారు. ఇందులో 44 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీల లో చుక్కల ముగ్గులకు



ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలు

ప్రాధాన్యత ఇచ్చారు. ఈ ముగ్గుల పోటీకి పవన్, వర్మ, తనుజ జడ్జిలుగా వ్యవహరించారు. ముగ్గులను పరిశీలించి మొదటి బహుమతి కడపకు చెందిన జి.రమ్య రెడ్డి రూ. 5 వేలు, రెండో బహుమతి కడపకు చెందిన కె. సుప్రజ రూ.3వేలు, తృతీయ బహుమతి జి. సునీత రూ.2 వేలు గెలుపొందినారు. వీరికి మన్ మందిర్ షాపింగ్ మాల్ వారిచే ప్రైజ్ మనీ అందజేశారు. ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సలేన్స్ ప్రైజ్ ఇచ్చారు.

సాయి ఏజెన్సీని రద్దు చేయాలి

- మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లావ్యాప్తంగా క్లాప్ బండ్లు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడపలో నడుస్తున్నాయని, కార్మికులకు రూ.18వేలు ఇవ్వాల్సి ఉండగా, కట్ చేసి రూ .10,500 మాత్రమే ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా విశాఖలో రూ.18 వేలు ఇస్తున్నారని తెలిపారు. కడపలో మాత్రం రూ.13 వేలని చెప్పి కటింగ్‌ల పేరుతో రూ.10,500 మించి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రెడ్డి ఏజెన్సీ, పావని ఏజెన్సీ మీద లేబర్ డిపార్ట్‌మెంట్లో చర్చలు నడుస్తున్నాయని తెలిపారు. సాయి పావని యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా తక్కువ వేతనాలు ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేసి కార్పొరేషన్, మున్సిపాలిటీలు నిర్వహించాలని తెలిపారు. జీవో నంబర్ 7 ప్రకారం రూ.24,500 ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజల ద్వారా వసూలు చేస్తున్న టువంటి డబ్బులు ఒక్కొక్క క్లాప్ బండికి దాదాపు రూ.63 వేలు ఇస్తున్నారని తెలిపారు. కానీ డీజిల్, డ్రైవర్ ఇతరుల పేరు మీద రూ. 30 నుంచి రూ.40 వేలు మాత్రం కూడా ఖర్చు పెట్టలేదని పేర్కొన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, సక్రమంగా కట్టలేదని తెలిపారు. వీటన్నిటి పైన విచారణ చేసి సాయి పావని ఏజెన్సీ, రెడ్డి ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు. ఏజెన్సీలను రద్దు చేసి మున్సిపాలిటీలు స్వాధీనం చేసుకొని వారే నిర్వహించాలని పేర్కొన్నారు.

డిఇఒపై చర్యలు తీసుకోవాలి

- స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు వినతిపత్రం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులను తీవ్రంగా దుర్భాషలాడుతూ, మానసిక క్షోభకు గురి చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి తమకొద్దని, వెంటనే చర్యలు తీసుకోవాలని మంగళగిరిలోని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజ యరామరాజుకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు తీసుకున్న మీనాక్షి పలు పాఠశాలలు

కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సందర్శించినప్పుడు అక్కడి ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను దుర్భాషలాడుతూ మానసిక శోభ గురిచేస్తుందని పేర్కొన్నారు. ఆమె అడిగిన దానికి సమాధానం చెప్పినా ఏదో ఒక వంక చూపుతూ తిట్లు దండకం మొదలుపెడుతారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కనీసం కూర్చోమని కూడా చెప్పకపోవడం, ఒక ప్రధానోపాధ్యాయులపై ఉమ్మి వేయడం, పోయిన చోటల ప్రతి ఉపాధ్యాయుని కారణం లేకుండా సస్పెండ్ చేస్తానని హెచ్చరించడం, తీవ్ర ఆక్షేపినియమని చెప్పారు. ఒక ఉపాధ్యాయుడు నల్లగా ఉండటంవల్ల కర్రేడు అని వ్యాఖ్యానించడం, ఒక ప్రధానోపాధ్యాయుడిని 'వీడు ఎక్కడికి పోయాడు' అని అనడం, ఉపాధ్యాయులను బానిసలకంటే హీనంగా చూస్తూ ఉండడం చూసి ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు ఇటువంటి డిఇఒ జిల్లాకు ఉండడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వైయస్సార్ జిల్లాలోని 27 సంఘాల ఉపాధ్యాయ సంఘాల నాయకులందరూ 'ఇ డిఇఒ మాకు వద్దు' అని ఉద్యమ కార్యాచరణను ప్రకటించారని తెలిపారు. ఈనెల 9 నుంచి 12 వరకు ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రాలు సమర్పించడం, 23, 24 వ తేదీ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రతి పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, 28, 29వ తేదీల్లో రోజంతా నల్ల బ్యాడ్జీలతో బోధన, ఫిబ్రవరి 1న డిఇఒ కార్యాలయం ముట్టడి, 3, 4 తేదీలలో మహాత్మా గాంధీజీ, డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు సమర్పణ, 5 నుంచి 14 వరకు రిలే నిరాహార దీక్షలు, 19న మాస్ క్యాజువల్ లీవ్. మార్చి 1 నుంచి ఆమరణ నిరాహార దీక్షలుంటాయని తెలిపారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కోసం ఉద్యమ కార్యాచరణ అమలు చేస్తామని చెప్పారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, ఎస్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, ఎస్ఎల్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులు అంకాల కొండయ్య, ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఎన్‌సిసి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. సుబ్బారెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు పద్య పఠన పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా రచయితల మహాసభలల్లో భాగంగా కడప బాలోత్సవం వారి సౌజన్యంతో సంస్థ అధ్యక్షులు బి.గోపాల్, ప్రధాన కార్యదర్శి బి.ఆర్. రాహుల్, చరిత్ర పరిశోధకులు కల్లూరు బాలయల్లారెడ్డి ఆధ్వర్యంలో కడప బాలాజీ నగర్‌లో ఉన్న ఎస్.వి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో మాతృభాష పట్ల మమకారాన్ని, జ్ఞాపక శక్తిని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే దిశగా పద్య పఠన పోటీలు ఏర్పాటు చేశామని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. మొదటి విభాగంలో 6, 7, 8 తరగతి విద్యార్థులకు వేమన, సుమతి శతకాలు, రెండవ విభాగంలో 9, 10 తరగతి విద్యార్థులకు భాస్కర శతకంలో పద్యాలను పద్యపఠన పోటీకి ఏర్పాటు చేశామని, ఒక్కొక్క విభాగం నుంచి ప్రథమ (2000), ద్వితీయ(1500), తృతీయ(1000) క్యాష్ బహుమతులతో పాటు సర్టిఫికెట్, జ్ఞాపికలను అందజేస్తామని చెప్పారు. అలాగే ఒక్కొక్క విభాగం నుంచి ఏడు మందికి ప్రోత్సాహక బహుమతులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి విభాగంలో కె. వెంకట దేవేష్ గౌడ్, ఎం.శివ ధనుష్, జి.రాధిక, రెండవ విభాగంలో బి.భారతి, ఎస్.సమీర్ అహమ్మద్, ఎం.రఘువీర్ వరుసగా ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు సాధించారని చెప్పారు.

మొద్దునిద్ర

ప్రజా'దృష్టి'

ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో సంక్షోభం నెలకొంది. ఒకవైపు కరువు, మరోవైపు విద్య, వైద్య రంగాల పాలనా వైఫల్యాలు ఆందోళన కలిగించడం తెలిసిందే. ఆర్నెళ్ల కిందట కడప జిల్లా డిఇఒ విధుల్లోకి వచ్చినప్పటి నుంచి వివాదా స్పదం వైఖరిని అవలంభించడం విమర్శలకు కారణంగా మారింది. జిల్లాలోని 35 మండలాలకు చెందిన సుమారు ఏడు వేల మంది ఉపాధ్యాయ, సిబ్బందిల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. నెల రోజుల కిందట జిల్లాలోని 2,328 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల బయోడేటాను సకాలంలో అప్‌లోడ్ చేయలేదనే కారణంతో 800 మంది ప్రభుత్వ ప్రధానో పాధ్యాయులకు నోటీసులు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయినప్పటికీ డిఇఒ తగ్గలేదు. ఇటీవల ఇలియాస్‌బాషా అనే ఉపాధ్యాయుడు మృతి చెందడం వెనుక డిఇఒ నిర్లక్ష్య వైఖరి ఉందనే కారణంతో జిల్లా ఉపాధ్యాయ లోకం ఉద్యమబాట పట్టింది. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల ఆన్‌లైన్ వివరాలను అప్‌లోడ్ అంశంలో నిర్లక్ష్యం నెలకొందనే ఉద్దేశంతో జారీ చేసిన నోటీసుల ఘటనలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మొదలుకుని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. అప్పట్లో డిఇఒ తన వైఖరిని కాస్త సడలి ంచుకున్నట్లు కనిపించింది. తాజాగా ఓ ఉపాధ్యాయుని మృతి వెనుక డిఇఒ కఠిన వైఖరి ఉందనే ఆరోపణల నేపథ్యంలో జిల్లాలోని ఉపాధ్యాయ సం ఘాలన్నీ 10 రోజులుగా ముక్తకంఠంతో ఈ డిఇఒ మాకొద్దు అంటూ నినది స్తుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో బుద్ధిజీవుల ఆందోళనలు పెద్ద ఎత్తున జరుగుతున్నప్పటికీ ఎవరికీ పట్టడం లేదు. కలెక్టర్ మొదలుకుని రాష్ట్ర విద్యాశాఖా కమిషనర్, విద్యాశాఖా మంత్రి లోకేష్ వరకు ఎవరికి పట్టక పోవడం ఆందోళనకరం. పాలకుల నిర్లక్ష్యపు వైఖరి కారణంగా జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్తకంఠంతో ఆందోళన కొనసాగిస్తుండడం అందరినీ ఆకర్షిస్తోంది. అన్నమయ్య జిల్లాలోని ఖరీఫ్ కరువు పరిస్థితులను అంచనా వేయడంలో పాలకులు మొద్దునిద్రను నటించడం ఆందోళనకరం. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 21 మండలాల్లో కరువు కరాళ నృత్యం చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. 2024-25 ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్ సైతం ముగింపు దశకు చేరుకుంది. దశలో కేంద్ర ప్రభుత్వం కరువు బృందాలను పంపించడం వల్ల కరువు పరిస్థితుల్ని ఎలా అంచనా వేస్తుందో తెలియడం లేదు. ఏ పారామీటర్ల ఆధారంగా కరువు తీవ్రతను అంచనా వేస్తుందో తెలియడం లేదు. అనంతరం కరువు నివారణకు ఎటువంటి సిఫారసులు చేస్తుందో తెలియడం లేదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరువు పరిస్థితుల నెలకొన్న సీజన్‌లో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను అంచ నా వేయడానికి కరువు బృందాలను పంపించాలి. అప్పుడే వాస్తవిక అంచనాలకు రావడానికి అవకాశం ఉంటుందని గ్రహించాలి. వాస్తవ అంచనాల ఆధారంగా రైతాంగాన్ని ఆదుకోవడంపై అవగాహన ఏర్పడుతుంది. వాస్తవిక అవగాహన నేపథ్యంలో ప్రభుత్వాలు ఏమేరకు సహకారాన్ని అందించాలనే అంశంపై స్పష్టత వస్తుందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉపాధ్యాయుల కొరత.. విద్యా బోధన సాగేదెలా?

విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలి - ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెస్తామంటున్న ప్రభుత్వం ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. ఆ మేరకు దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యార్థుల సంఖ్య నిష్పత్తికి అనుగుణంగా ప్రైమరీ పాఠశాలలో 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, ఉన్నత పాఠశాలల్లో 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ప్రస్తుతం 50 నుంచి 52 మందికి ఒక్కో ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 18 వేల మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 1000 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలి. గత ప్రభుత్వంలో అప్పర్ ప్రైమరీ సర్కూళ్లలో జిఒ నంబర్ 117 ద్వారా ప్రధానోపాధ్యాయులను తీసే శారు. ప్రైమరీ స్కూల్లో 3,4,5 తరగతులను హైస్కూల్లో కలిపారు. ప్రాథమిక పాఠశాల సెక్షన్ చాలా దెబ్బతింది. 70 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులను తొలగించారు. ఆ జిఒను రద్దుచేసి ప్రధానో పాధ్యాయులను మళ్లీ నియమించాల్సిన అవసరం ఉంది. కొన్నిచోట్ల ఉపా ధ్యాయుల కొరత తీవ్రంగా ఉండడం వల్ల విద్యా బోధన కుంటుపడుతోంది. అలాంటిచోట కనీస వేతనాలతో అర్హత కలిగిన వాలంటీర్ ఉపాధ్యాయులను నియమిస్తే సమస్య తగ్గుతుందని పలువురు సూచిస్తున్నారు.

10వ తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వంద రోజుల రివిజన్ ప్రణాళికను అమలు చేస్తున్నారు. క్వశ్చన్ బ్యాంక్ కొత్త వెర్షన్‌తో కొన్ని మోడల్ పేపర్లను జోడించి విద్యార్థులకు సాధన చేయించి అవగాహన కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే రిటైర్మెంట్ ఉపాధ్యాయుల స్థానంలో రిక్రూట్మెంట్ చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న ఆలస్యానికి బోధించేవారు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఉపాధ్యాయులే అదనపు క్లాసులు తీసుకుంటుండడంతో వారిపై పని భారం, ఒత్తిడి పడుతోంది. ఉన్న ఉపాధ్యాయులకు క్లాసులు వేయడంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పడే కష్టం వర్ణనాతీతం. ఉపాధ్యాయులకు సంబంధం లేని సబ్జెక్టులను బోధిం చేందుకు కూడా పంపిస్తున్నారు. ఇలా చేస్తే ఏం ప్రయోజనమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వృత్తి విద్య (క్రాఫ్ట్, డ్రాయింగ్) ఉపాధ్యాయులు ప్రతి స్కూల్లో ఉండేవారు. చాలామంది వృత్తి విద్య ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేస్తు న్నారేకానీ, వారి స్థానంలో రిక్రూట్మెంట్ జరగడం లేదు. గత సంవత్సరం విద్యా ర్థులకు ఇచ్చిన స్కూల్ కిట్టులో బ్యాగులు నాసిరకంగా ఉన్నాయి. వచ్చే సంవ త్సరంలో అయినా మంచి బ్యాగులు ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. కరోనా తర్వాత విద్యార్థులలో క్రమశిక్షణ తగ్గిందని కొందరు ఉపాధ్యాయులు పేర్కొం టున్నారు. గత వైసిపి ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులు మొదలయ్యాయి.. మధ్యలో ఆగిపోయిన పనులను పూర్తి చేసి విద్యా ర్థులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మనబడి-మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులను ప్రారం భించనుంది. వాచ్‌మెన్‌ల నియామకం లేకపోవడంతో పాఠశాలల్లో రాత్రిపూట చోరీలు జరుగుతున్న సందర్భాలున్నాయి. పాఠశాలలు అసాంఘిక కార్య కలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. కంప్యూటర్లు ఉన్నా అన్ని పాఠశాలల్లో ఆపరేటర్లు దాదాపుగా లేరు. ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లున్నా ఆపరేటర్లు లేరు. వీటన్నిటినీ భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

పరీక్ష విధానంపై ప్రక్షాళన

గత సెప్టెంబరు నెలలో రాష్ట్ర ప్రభుత్వం పరీక్షల విధానంపై ప్రత్యేక మార్పును తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. 2025-26 సంవత్సరంలో పరీక్ష విధానాన్ని పూర్తిగా మార్చి వేయనుంది. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా పరీక్ష విధానాన్ని మార్చనుంది. ప్రస్తుతం రాష్ట్ర బోర్డు పరీక్షలు ఎక్కువగా థియరీ మీద ఆధారపడి ఉన్నాయి. వాటిని విశ్లేషణాత్మక విధానంలోకి మార్చనుంది. మొత్తం మీద పరీక్ష విధానంలో మార్పులు జరగనున్నట్లు సమాచారం. 2024-25 విద్యాసంవత్సరానికిగానూ గత ప్రభుత్వం వెయ్యి పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టింది. టీచర్లకు ఏమాత్రం శిక్షణ ఇవ్వకుండా సిబిఎస్ఇ సిలబస్‌ను ఎలా బోధిస్తారని అంటూ ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సిబిఎస్ఇని రద్దు చేస్తున్నట్టు మంత్రి నారా లోకేష్ ప్రకటించారు.

వంద శాతం ఉత్తీర్ణతకు చర్యలు

మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 9,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది 400 మంది విద్యార్థులు తగ్గారు. ఉపాధ్యాయుల కొరత కొన్నిచోట్ల ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు పెరిగితే హైస్కూల్లో కూడా విద్యార్థులు పెరుగుతారు. టైం టేబుల్ ప్రకారం సబ్జెక్టుల వారీగా విద్య బోధన చేయాలని ఉపా ధ్యాయులకు చెబుతున్నాం. విద్యా ర్థులకు హ్యాండ్ రైటింగ్ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నేర్పించేందుకు వాలంటీర్లను నియమించాం. గత సంవత్సరం 10వ తరగతిలో 75శాతం ఉత్తీర్ణత సాధిం చాం. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 10వ తరగతి 545 మంది విద్యార్థులు చదువుతున్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం

- శివప్రసాద్, ఎంఇఒ, ఎర్రగుంట్ల

తెలుగు, హిందీ ఉపాధ్యాయుల కొరత ఉంది

ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో 745 మంది విద్యార్థులున్నారు. తెలుగు, హిందీ సబ్జెక్టుల ఉపాధ్యాయుల కొరత ఉంది. హిందీకి ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. డిప్యూటేషన్ మీద కొందరు ఉపాధ్యాయులు వెళ్లారు. పని సర్దుబాటు పరంగా నలుగురు ఉపాధ్యాయులను వేరే స్కూళ్లకు పంపాం. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది 100 మంది విద్యార్థులు తగ్గారు. గత సంవత్సరం పదవ తరగతి లో 79శాతం ఉత్తీర్ణత సాధించాం. ఈ ఏడాది 100శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నాం.

- రామాంజనేయులురెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఎర్రగుంట్ల, జడ్‌పిహెచ్ఎస్ బాలుర పాఠశాల

మినీగోకులాన్ని ప్రారంభిస్తున్న మారెడ్డి జోగిరెడ్డి

పాడి రైతుల అభ్యున్నతే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పాడి రైతుల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని తుంగభద్ర ప్రాజెక్ట్ హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హిమకుంట్లలో రూ2.30 లక్షలతో నిర్మించిన మినీ గోకులానిన శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జోగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో నిర్మించిన మినీ గోకులాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీవో జయభారతి, టెక్నికల్ అసిస్టెంట్ రజిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది

జమ్మలమడుగు రూరల్ : మినీ గోకులాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణ రెడ్డి కోరారు. శనివారం మండల పరిధిలోని పెద్ద దండ్లూరు గ్రామంలో ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామి రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిఒ పద్మారాణి, టెక్నీకల్ అసిస్టెంట్స్, గ్రామ సర్పంచ్ రామంజనేయ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గోకులం షెడ్ యజమానులు పాల్గొన్నారు.

వేంపల్లె : పాడి రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అలిరెడ్డిపల్లె, కుప్పాలపల్లె, కుమ్మరాంపల్లె గ్రామాల్లో నిర్మించిన మినీ గోకులం షెడ్లను రఘునాథ్‌రెడ్డి ప్రారభించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద రోడ్లు, పశువుల షెడ్లు నిర్మాణం చేపట్టారన్నారు. పాడి రైతులు గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ఏమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, గోపినాథ్‌రెడ్డి, రెడ్డయ్య, రజనీకాంత్‌రెడ్డి, వేమకుమార్, కుప్పాలపల్లె ప్రసాద్, చందు, పలువురు టిడిపి నేతలు, ఉపాధి హామీ, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేములలో..

వేముల : సంపద సృష్టి విధానంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, ముందుచూపుతో పని చేస్తున్నారని, నిత్యం ప్రజలకోసం ఆలోచించే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం ఎపికి వరమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి అన్నారు. మండలంలో కూటమి ప్రభుత్వం రైతులకోసం నిర్మించిన మినీ గోకులం షెడ్లను పార్థసారథిరెడ్డి, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధి హామీ ఎపిఒ మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కల్యాణ్ కుమార్‌రెడ్డి, పవన్, బాబా, పద్మనాభరెడ్డి, చిన్నరెడ్డి, మల్లికార్జునరెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీనాథ్, మోహన్ బాబు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఖాజీపేట : ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని ఎంపిడిఒ దివిజా సంపతి కోరారు. శనివారం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిఒ చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, సచివాలయ,ఉపాధి సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ముద్దనూరు : నొస్సంవారిపల్లెలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన మినీ గోకులాలను శనివారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎంపిడిఒ ముకుందారెడ్డి ఆధ్వర్యంలో కొసినేపల్లి, చింతకుంట, మంగపట్నం, గంగాదేవిపల్లి, ఓబులాపురం గ్రామాల్లో మినీ గోకులాలను ప్రారంభించారు. నాయకులు శివరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పశు వైద్యాధికారి హిమబిందు, ఎపిఒ గంగయ్య, ఇసి ఉజ్వలరెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి క్షేత్రంలో జరుగు నిత్యాన్నదానానికి శనివారం కడప పవన్‌కల్యాణ్ తల్లిదండ్రులు ఆనంద్‌బాబు, వనిత వారి కుటుంబ సభ్యులు రు.50 వేలు చెక్కు రూపంలో విరాళం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ జి.వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, మాజీ చైర్మన్ కల్లూరి వెంకటస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూపాయి పతనం ప్రమాదకరం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రపంచ మార్కెట్లో రోజు రోజుకూ రూపాయి పతనమవడం చాలా ప్రమాదకరమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాజాగా డాలరుతో రూపాయి మారకం విలువ ఎన్నడూలేని విధంగా రూ.86కు పడిపోయిందని చెప్పారు. దేశ చరిత్రలోనే ఇది అత్యంత కనిష్టస్థాయి అన్నారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి ఒక అమెరికన్ డాలర్ విలువ రూ.62.33 ఉండేదన్నారు. ఆనాడు మోడీతోపాటు బిజెపి నాయకులు తీవ్రంగా విమర్శలు చేశారన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే రూపాయిని బలోపేతం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రూపాయి విలువ మరింత పతనమైందని వివరించారు. ఇది దిగుమతులు, వాణిజ్య చెల్లింపులు, విదేశీ అప్పు చెల్లింపులపై తీవ్ర భారం పడుతుందన్నారు. విదేశీ మారక నిల్వలు హరించుకుపోతాయన్నారు. ప్రస్తుతం మన వద్ద 635 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రమాదంలో చిక్కుకుంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రూపాయి మరింత పతనం కాకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి చెప్పారు.

రామసుబ్బారెడ్డికి తులసిరెడ్డి నివాళులు

ప్రజాశక్తి - చక్రాయపేట

అద్దాలమర్రి మాజీ సర్పంచ్ గాజులపల్లె రామసుబ్బారెడ్డి మృతికి శనివారం పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి నివాళులర్పించారు. రామసుబ్బారెడ్డి అనారోగ్యంతో మరణించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, వినయ్ పాల్గొన్నారు. రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతూ.. తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నివాళులర్పిస్తున్న నాయకులు

స్వాతంత్ర్య సమరయోధుడు ఒడ్డె ఓబన్న 218వ శత జయంతి సందర్భంగా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా బయన్న, శ్రీనివాసులు, రాధాకృష్ణ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసిం హారెడ్డి చేసిన సాయుధ పోరులో సైన్యాధ్యక్షుడుగా ఉంటూ వడ్డే ఓబన్న వీరో చితంగా బ్రిటిష్ వారితో పోరాడారని తెలిపారు. కర్నూలు కేంద్రంగా 1847లో 5000 మంది రైతులతో బ్రిటిష్ వారిని తరిమిన ఘనత ఓబన్నది అని కొని యాడారు. నాగరాజు, రెడ్డయ్య, వడ్డే నాయకులు, బిసి నాయకులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రికి ఘన నివాళులు

ప్రజాశక్తి - ఖాజీపేట

భారత స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ప్రధాని లార్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా శనివారం బస్టాండు వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయ కులు షేక్ హాజీగౌస్, ఇస్మాయిల్, చరిత్రకారుడు ఇంతియాజుద్దీన్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కడప

కడప నగరం ఊటుకూరు ప్రకృతినగర్‌లో ఉన్న పి.రామిరెడ్డి విద్యాసంస్థల్లో శనివారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. యాజమాన్యం చైర్మన్ ఈశ్వరరెడ్డి, కరస్పాండెంట్ గౌతంరెడ్డి, సెక్రటరీ జయసుబ్బారెడ్డి, కుటుంబసభ్యులతో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. 80 టీంలు ముగ్గుల పోటీలో పాల్గొన్నాయి. ప్రధానోపాధ్యాయులు నెల్సన్‌కుమార్, యుగంధర్‌రెడ్డి, గ్లోరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయనిర్ణేతగా సింగారెడ్డి సుజాత విద్యా ర్థులకు బహుమతులు అందజేశారు. వాలీబాల్ మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండవ బహుమతిగా రూ.20వేలు అందచేశారు. ముగ్గుల పోటీలో మొదటి, రెండవ బహుమతిగా రూ.60 వేలు అందజేశారు. సంప్ర దాయక దుస్తుల పోటీలో మొదటి బహుమతి కరస్పాండెంట్ గౌతంరెడ్డి కూతురు రేవారెడ్డి రూ.50వేలు గెలుచుకున్నారు. అట్టహాసంగా జరిగిన గంగిరెద్దుల హరిదాసుల కోలాహలంలో 1000 మంది విద్యార్థులు పాల్గొని పొంగలి వంట చేసి భోగి మంట చుట్టూ చేరి నృత్యాలతో అలరించారు. రామిరెడ్డి కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పి.రామిరెడ్డి విద్యాసంస్థల్లో..

బహుమతులు ప్రదానం చేస్తున్న యాజమాన్యాలు

క్రికెట్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిసెంబర్ 30న ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో విజేతలకు మెడల్స్, కప్‌ను మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ మోరె లక్ష్మణ్‌రావు ముఖ్యంగా అతిథిగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి, మోరె లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమన్నారు. క్రీడలు మానసిక వికాసానికి దోహదపడుతాయన్నారు. గెలుపోటములు సహజమన్నారు. క్రీడా స్ఫూర్తితో గెలిచి ముందుకు సాగిన ఇరు జట్లను అభినందించారు. స్థానిక వివేకనంద జూనియర్ కళాశాల, షిరిడి సాయి జూనియర్ కాలేజీ, ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు హరిబాబు, పవన్, ఇర్ఫాన్, ఖాదర్, నరేంద్ర, నాగేంద్ర, ఇషాద్, చింటూ, కళాశాల యాజమాన్యం, క్రీడాకారులు పాల్గొన్నారు.

రక్తదాతలుగా మారాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆరోగ్యవంతులు రక్తదాతలుగా ఉండాలని సర్ సివి రామన్ సైన్స్ క్లబ్ అధ్యక్షులు వంశీకృష్ణ కోరారు. శనివారం వైవిఎస్ మునిసిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో సర్ సివి రామన్ సైన్స్ క్లబ్ ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో రక్త వర్గ పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యవంతులు 16నుంచి 60ఏళ్ల వారు అవసరమైన వారికి రక్తందానం చేయవచ్చన్నారు. క్లబ్ సెక్రటరీ అల్లా బకష్ మాట్లాడుతూ హిమోగ్లోబిన్ శాతం ఆరోగ్యవంతులకు 14-17వరకు ఉండాలన్నారు. 9శాతం కన్నా తక్కువ ఉంటే అనీమియాతో బాధ పడతారని తెలిపారు. సమతుల ఆహారం తీసుకుని హిమోగ్లోబిన్ పెంచుకోవాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్, 40 మంది ఉపాధ్యాయులు, పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గోపీనాథ్‌రెడ్డి, రవి ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి ఓ యువ రక్తాన్ని కోల్పోయింది

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : వైసిపి ఓ యువ రక్తాన్ని కోల్పోయిందని జిల్లా వైసిపి మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వల్లంబాయి హృషికేశవరెడ్డి పేర్కొన్నారు. శనివారం పులివెందులలో వైసిపికి చెందిన అభిషేక్‌రెడ్డి పార్థివదేహం వద్ద ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వల్లంబాయి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి ఆదేశం తప్పక పాటించి జిల్లాలో వైఎస్ కుటుంబానికి ఒక యువ శక్తిగా ఉండేవరన్నారు. లింగాల మండలం ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తించడమే కాక మొన్న ఎన్నికల్లో జిల్లా మొత్తం పర్యటించి వైఎస్ కుటుంబ వారసుడిగా తనదైన ముద్ర వేశారన్నారు. ఇంత చిన్న వయసులోనే అకాల మరణం చాలా బాధాకరమన్నారు. అభిషేక్‌రెడ్డి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జక్కా జ్యోతి ఆహార ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక కొర్రపాడు రోడ్డులో పలు ఆహార పదార్థాల ఉత్పత్తులను తయారు చేసే జక్కా జ్యోతి ఆహార కేంద్ర సంస్థను శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆహార ఉత్పత్తుల కేంద్రంలో పనిచేసేందుకు పలువురికి ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం మహిళలకు చుక్కల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలో పాల్గొను మహిళలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు శిల్పారామంలో తమ పేర్లు నేరుగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 88866 52010, 90002 58848 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలకు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపటి నుంచి వెదురూరులో సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వెదురూరులోని పార్వతిదేవి సమేత సంగమేశ్వర దేవస్థానంలో సోమవారం నుంచి గురువారం వరకు మకర సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. పండుగ సందర్భంగా ప్రత్యేకపూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. 13న రాక్‌రోల్ అకాడమీ ఆధ్వర్యంలో డ్యాన్స్ ప్రోగ్రాం, 14న ఏకపాత్రాభినయం పోటీలు, గణేష్ ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో మ్యూజి కల్ నైట్, 15న కనుమ పండుగ సందర్భంగా కోలాటం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. 15న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బండలాగుడు పోటీలకు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతారని గ్రామపెద్దలు తెలిపారు.

14న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని చెముళ్లపల్లెలో సంక్రాంతి సందర్భంగా ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. 13న పూజా కార్యక్రమాలతోపాటు ముగ్గుల పోటీలు, 14న రాష్ట్రస్థాయి సేద్యపు ఎడ్లచే బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. బండలాగుడు పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.25వేల 116, రెండవ బహుమతిగా రూ.20వేల 116, మూడవ బహుమతిగా రూ.15,116 అందజేయనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 15న పార్వేట సందర్భంగా ఆర్కెస్ట్రా, కోలాటం, గ్రామోత్సవం ఉంటాయన్నారు.

కిటకిటలాడిన పశువుల సంత

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు వారాంతపు పశువుల సంత శనివారం రైతులు, పశువులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని పొట్టేళ్లు, మేకపోతులు, కోళ్లు అధికంగా సంతకు వచ్చాయి. ప్రజలు కూడా వాటిని కొనుగోలు చేసేందుకు అత్యధికంగా వచ్చారు. బుధవారం కనుమ పండుగ ఉండడంతో నాటుకోళ్లు, పొట్టేళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. వీటితోపాటు ఎనుములు, ఎద్దులు ఇతర జీవాలకు కూడా అధికంగా డిమాండ్ ఏర్పడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పాడి రైతులు అధికంగా సంతకు వచ్చి అమ్మకాలు, కొనుగోలు చేపట్టారు. సాధారణంగానే మైదుకూరు పశువుల సంత రాష్ట్రంలోనే ప్రసిద్ధి. దీనికితోడు సంక్రాంతి పండుగ ఉండడంతో జనం మరింత అధికంగా కనిపించారు.

జనంతో కిటకిటలాడుతున్న పశువుల సంత

హద్దు మీరితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఎస్ఐ రంగారావు

సంక్రాంతి సందర్భంగా వేడుకల్లో హద్దుమీరితే కఠిన చర్యలు తప్పవని, పండగ వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రంగారావు సూచించారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జూదం, అశ్లీల నృత్యాలు, గుండాట, కోడి పందేల నిర్వాహణకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సంయుక్తంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పండుగలను పోలీసుల మార్గదర్శకాలను అనుసరించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో గుమికూడి కేకలు వేయ డం, యువత మోటర్ వాహనాలపై అతివేగం, జంపింగ్‌లు, కోడిపుంజులతో ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, బహిరంగ పార్టీలు నిర్వహించడం, ప్రజలు ఇ బ్బందులు పడేలా డిజెలు నిర్వహించడం వంటి వాటిపై ఇప్పటికే నిఘా పెట్టా మన్నారు. మద్యం సేవించి ఈవ్ టీజింగ్‌కు పాల్పడడం, సారా విక్రయాలు వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముద్దనూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, గ్యాంబ్లింగ్, అసభ్యకర నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. స్పెషల్ పార్టీ, రూట్ మొబైల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సింహాద్రిపురం : మండలంలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పులివెందుల డిఎస్‌పి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిని ఉపేక్షించబోమన్నారు. ఎక్కడైనా కోడిపందేలు, జూదం ఆడుతున్న సమాచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు తెలపాలన్నారు. 91211 00613, డయల్ 100/112కు ఫోన్ చేసి సమాచారం తెల పాల న్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

ఎస్ఐ తులసి నాగప్రసాద్

ఎర్రగుంట్ల : సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని కలమల్ల ఎస్ఐ తిమోతి కోరారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ కోడి పందేలు, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మఫ్టీ, యూనిఫాంలోనూ పోలీసులను గస్తీ నిర్వహించేందుకు స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేశారన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతూ ఉంటే 91211 00533 నెంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యేచే నేడు పలు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదివారం పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొననున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఆది ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు మండలం శివపురం గ్రామ పంచాయతీలో మినీ గోకులం, మున్సిపాలిటీ పరిధిలోని నంద్యాల రోడ్డు బైపాస్ వద్ద ఇంద్రప్రస్థ వెంచర్ ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంద్రప్రస్థ క్యాలెండర్-25ను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత మండల నాయకులు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

వైసిపి మండల కన్వీనర్‌గా రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి మండల కన్వీనర్‌గా చాపాటి రాజశేఖర్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర నాథ్‌రెడ్డి నియమించారు. జిల్లాలో ఎన్నికల అనంతరం ఏర్పడిన పరిస్థితుల కారణంగా కొన్ని మండలాలలో వైసిపి మండల కన్వీనర్లను మార్పు చేస్తూ నూతనంగా కొందరి నియామకాలను చేపట్టారు. చాపాడులో రాజశేఖరరెడ్డిని మళ్లీ కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తన నియామకానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వైసిపి మండల అధ్యక్షులుగా శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

వైసిపి మండల అధ్యక్షులుగా తిమ్మాపురం గ్రామానికి చెందిన నడమల శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ వైసిపి మండలశాఖ అధ్యక్షుడిగా తనను వరుసగా 3వసారి నియమించినందుకు పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు పాటుపడుతానని తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.